మంథా వెంకట రమణారావు

# బరువు




***"గాజులు! గాజులేయ్!" అన్న కేకకు ప్రతిధ్వనిగా, "గాజులు! గాజులు!" అంటూ మరో చిన్నకేక***

కావడి మోస్తూ ఒక మనిషి — కావడి మొయ్యకుండా ముందు నడుస్తూ ఒక మనిషి. కావడి మోసేవాడు కూలీ! కావడి ముందు వాడు యజమాని!

యజమాని షెరాయి, కమీజూ, కాళ్ళకి జోళ్ళు వేసుకున్నాడు—మే నెల ఎండ తగలకుండా గొడుగు వేసుకున్నాడు. గడ్డం, ముస్లిమ్ సాంప్రదాయ ప్రకారం ఒక పావు అంగుళం మొలిచి ఉంది. అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు— బుగ్గలో కారాకిళ్ళీ తుపుక్ తుపుక్ మని అప్పుడప్పుడూ రోడ్డు మీద కిళ్ళీ రసాన్ని ఉమ్ముతున్నాడు. కిళ్ళీలోని జర్దాపాన్ ఒంటికి నిషా ఇవ్వగా మహా హుషారుగా అడుగులు వేసుకుంటూ నిముష నిముషానికి "గాజులు! గాజులు!" అంటూ నడుస్తున్నాడు.

కావడిలో రెండు పెద్ద ట్రంకుపెట్టెల నిండా ఉన్న గాజులని ఇటూ అటూ పెట్టి మోస్తున్నాడు కూలీ. గబగబా చిన్న పరుగుతో నడుస్తూ ఉండే కుదుపుకి రెండు పెట్టెలూ లయబద్ధంగా కిందకీ మీదికీ కదుల్తూ కడ కడ, కడ కడ మని చప్పుడు చేస్తున్నాయి. కావిడిబద్ద ఎడంభుజంమీద బాగా మోసింది. పెద్ద గరుడపక్షి రెక్కలు ఆడించినట్టు కిర్రు కిర్రు మని చప్పుడు చేస్తూ కిందామీదా అవుతోంది కావిడిబద్ద.

కూలీ ఒంటిమీద చొక్కాలేదు, బనియ

నన్నాలేదు తలకి పాగాలేదు. కాళ్ళకి చెప్పులు లేవు నడుమునుంచీ, మోకాల వంకూ మర్యాద కాపాడ్డాని కన్నట్టు, ధూళి పట్టి మరకలుపడ్డ ఒక పొట్టి చిరుగుల పంచ ఉంది. ఆ పంచ వెడల్పు మూడు అడుగులు— పొడవు ఆరడుగులు. నడుం చుట్టూ వో చుట్టు చుట్టి, గోచీ కచ్చ కట్టేడు. వాడి తొడల నలుపు కనిపిస్తోందా పంచ లోంచి. ఒళ్ళు గురుకుదేరిన నల్ల సీనం రాయిలా ఉంది.

కూలీ చర్మంలోంచి చెమట చిమ్మి ఒంటిని తడుపుతోంది. బిందువు పుట్ట గానే సూర్యకాంతి పడి ముత్యంలా మెరిసి కరిగి పారుతోంది. ఎన్నో ముత్యాలు—ఎన్నో ధారలు. కూలి వెంట్రుకలు పండలేదు — కాని ముఖం ముడతలవల్ల వయసు యాభై పైన అని తెలుస్తోంది. బరువు వల్లా, నడక అలసటవల్లా ముక్కుపుటాలు ఎగిసె కావిడిబద్ద ఆనేచోట కాయ కట్టింది. పూజ ఎద్దుకిలా. కాళ్ల పిక్కలమీద నరాలు పైకి ఎగతన్నేయి ఎన్నోవేల మైళ్ళు నడిచి నడిచి కాళ్ల పాదాల చర్మం, మనిషి చర్మంతో కుట్టిన చెప్పుల్లా తయా రయ్యేయి.

ముందు నడుస్తున్న మనిషి పేరు మాలిక్ మియా బరువు మోస్తున్న కూలీ పేరు తవిటయ్య మాలిక్ అంటే దేవుడని అర్థముంది; యజమాని, అధికారి అని కూడా అర్థాలున్నాయి. కాని దేవుడు తన మాలిక్ గిరీ కొందరు మనుష్యుల కప్పగించే సేడు... రాజుల కాలంలో రాజులకీ— ఈ కాలంలో మంత్రులకీ, డిక్టేటర్లకీ—మదుపు పెట్టి పరిశ్రమలూ, వ్యాపారాలూ నడిపే వాళ్లకి, బ్యూరోక్రాట్లకీ—వీరు అధికారాన్ని కొంత అప్పగించగా. వాళ్ళు వారి కిందవారికి కొంత అధికారం వెదజల్లగా. వాళ్ళు వాళ్ళ కిందవాళ్ళకి... అలా అలా, పవరూ పైసా పరపతీ ఉన్న ప్రతివాడూ ఛోటా మాలిక్‌గా తయారయ్యేడు అలా భగవంతుడే అసలు మాలిక్ అయినా అతడు ఈ కోటానుకోట్ల జీవుల ద్వారా తన యాజమాన్యాన్ని నిరూ పించుకుంటున్నాడు.

అదే విధంగా, బరువుమోస్తూ నడిచే కూలీకి, ముందు నడిచే యజమాని మాలిక్.

బాబులందరూ ఆఫీసులకిపోయి, అమ్మ లందరూ అన్నంతిని కబుర్లాడుకునే వేళ మధ్యాహ్నం రెండు. ఆ రెండు గంటల వేళ ప్పుడు కావిడి భుజానవేసి నడక ఆరంభిస్తే సాయంత్రం ఆరు వరకూ నాలుగు గంటల మోత. నడక! ఎవరన్నా ''ఏయ్‌గాజులూ!'' అని పిలిస్తే ఆ యింట ప్రవేశించి గాజుల కావడి దించడం జరుగుతుంది. అప్పుడు కూలిపని ఆఖరు. యజమానిపని మొదలు— క్షణకాలం బరువునించి విముక్తి!

చాలా మంది అమ్మలు, అమ్మాయిలు పిలిచి, చూసి, బేరంచేసి. మూతులు విరుచు కొని, ''అబ్బే! షాపులో యింతకన్నాచవగ్గా యింతకన్న మంచి గాజులు దొరుకు తున్నాయి!'' అని పంపించేస్తారు. కావిడి భుజాన వేసుకుని మళ్ళా నడక ప్రారంభం.


ఇవాళ రెండు గంటలనించీ, నాలుగు వరకూ మోత అయింది కాని ఎవరూ పిలవలేదు. ''గాజులు గాజులేయ్!'' కేక వేసేడు తవిటి ఆర్తనాదం చేస్తున్నట్టు.

ఔను ఆర్తనాదమే! మూడు రోజులయి కూలీడబ్బు లివ్వలేదు మాలిక్ మియా. నాలుగు గంటలు బరువు మోస్తూ పరుగు లిసినందుకు రోజుకి కూలీ రెండు రూపా యలు. బేరం ఉన్ననాడు ఇస్తాడు—లేనినాడు బాకీ పెడతాడు. బాకీ డబ్బు వసూలు కష్టం! ఇప్పుడో అర్ధా, అప్పుడోరూపాయా ఇస్తాడు. రెండ్రోజులయి బేరంలేదు... అందుకు కూలిడబ్బు లందలేదు.

ఈ పట్నంలోని రెండుపేటలు తిరగడం అయింది అలసటతో ఎగిస్వాస వచ్చేస్తోంది. మాలిక్ ఇంతవరకూ ఒక కప్పు 'టీ' అన్నా పోయించలేదు. నిన్నట్నించి పస్తు— ఇవాళ పకాళ తిన్లేదు... అంబలి తాగలేదు— ఊరవతల సీవేజ్ కాలవ పక్కన వేసుకున్న పాకలోని తన సంసారమూ తనలానే పస్తు లుంది పెళ్ళాం, కూతురూ, ఇద్దరు కొడు కులూ సంసారం. ఇదివరకు పెళ్ళాం అసిరి పాచిపన్లుచేసి తనూ ఆర్జించేది. రెండు సంవత్సరాలయి పాకలోనే పడుంది. సాయం త్రాలుజ్వరం; దగ్గు నిత్యం. ఓ డాక్టరమ్మ ఇంట గాజులమ్ముతూ (కోడలికి) సంగతి చెప్పగా ఆదివారం తెమ్మంది అసిరిని. లక్షణాలన్నీ చూసి ''క్షయ'' అని చెప్పింది. రోగం ఏమిటో ఉత్తనే చెప్పింది కాని, మందు ఉత్తనే ఇవ్వదుకదా? వచ్చే కూలి లోంచి నాటు మందులు కొని వాడేడు. రక్తం పడడం ఆరంభం అవడం తప్ప మెరుగు పడలేదు — మంచంమీది పడుంది. ఎప్పుడో వోనాడు గుటుక్కుమంటుంది.

పెద్దపిల్ల నూకాలు పెద్దమనిషయి ఆరేళ్లయింది. వో ఇళ్లుకట్టే కంట్రాక్టర్ దగ్గర కూలిపని చేస్తుంది పని ఉన్నప్పుడు రోజుకు రెండు కూలి. సిమ్మెంటు లేదుట. కట్టడం పనులన్నీ ఆగిపోయేయి. బాకీలు పెట్టి ఆ కంట్రాక్టరు మాయమయ్యేడు. అదీ ఇంటి దగ్గర కూసుంది. ఏదో వో రోజున వో మగాడ్ని తీసుక లేచి పోతుంది తప్పదు... ఎందరో దానికంట పడ్డారు...

ఇంక ఇద్దరు కొడుకులూ... చదువులేక సంధ్యలేక... ఫైటింగు సినిమాలు చూసి దొంగతనం ఆరంభించేరు— వో రోజు



సినిమాహాల్ దగ్గర సైకిల్ చోరీచేస్తూ దొరికిపోయి జైల్లో పడ్డారు... మరో ఆర్నెల్లవరకూ రారు...!

"గాజులు... గ జులేయ్!" మొయ్యడమే కాక అరవడం కూడా పనిలోని భాగం. దాహంతో గొంతుక ఆర్చుక పోతోంది. ఎండ కారంలా ఒంటికి పూత పూస్తోంది వేడిని.

"రోజుకి ' పది రూపాయలిస్తాను... నీ అసిరికి వొయిద్యం చేయిస్తాను... నీ కూతుర్ని నా కప్పగించిరా తవిటిగా! ఆయిగ కాలుమీద కాలేసుక్కూకో! అడ్మాన్సు ఐదొందలు సేతులెడతాను!" అంటూ మంతనాలు జరపబోయింది వేశ్యల కంపెనీ నడిపే పాపమ్మ. ఎన్నో పాపాలు చేసిన పాపమ్మ ఇలా ఒక కుటుంబాన్ని ఆదుకొని పుణ్యం సంపాదించుకోవా లనుకుంది. తవిటయ్య... "ఛీ!దూ! నాపేణంపోవాల! మరెపుడూ యీ కబురు సెప్పకు!" అన్నాడు. గాజుల బేరానికి పాపమ్మ కంపెనీ మంచి కష్టమర్. తరవాత పాపమ్మ మాలిక్ మియా దగ్గర గాజులు కొనడం మానింది.

"వో కప్పు టీ యిప్పించు మాలిక్ బాబా!" తవిటయ్య ఆయాసపడుతూ అన్నాడు–

"అప్పుడే అలిసిపోయేవా? సరేపద!" అన్నాడు మాలిక్ మియా ఏ కళలోఉన్నాడో

వీధి కొసని ఒక టీ దుకాణం వుంది. పొయిలో కుంపటిమీద ఎల్యూమినియమ్ గిన్నెలో పాలతో కలిసిన నీళ్ళు మరుగుతున్నాయి. మాసిన కాకీ నిక్కరు తొడుక్కున్న పన్నెండేళ్ల కుర్రాడు సిసింద్రీలా వుషారుగా పనిచేస్తున్నాడు. చకచకా అరు పెద్ద చెమ్చాల పంచదారవేసేడు నీళ్లలో. పంచదారని నీరు జీర్ణింపజేసుకున్నాక, నాలుగు చెంచాల డస్ట్ టీ గుండ వేసేసరికి బుస్ మని కషాయం మీదికి పొంగింది. కనిపిస్తే అందరూ తాగేస్తారని భయపడిం దేమో మళ్ళా కిందకి దిగిపోయింది. వో రెండు నిముషాలు కళపెళ మరగనిచ్చి కెటిల్‌లోకి వడబోసేడు. కెటిల్ మూత పెట్టి. అక్కడున్న మూడు ఔన్సుల గ్లాసులలోకి, ఔన్సున్నర చొప్పున పోసి కష్టమర్లకి అందించేడు.

గాజులు కావడి బరువు దిగింది. నుదుట పట్టిన చెమటని వేళ్ళతో తుడుచుకున్నాడు, తవిటయ్య. "హో గళాసుడు నీళ్ళియ్యి!" ఆర్డరిచ్చేడు మాలిక్. "టీ ఇచ్చేదేటి గాజుల గురూ!" అడిగేడు సిసింద్రీ. "ముందు నీరియ్యి... తరువాత రెండు హాఫ్ టీ ఇయ్యి!" చిరాగ్గా అన్నాడు మాలిక్ మియా.

రెండు పెద్ద ఎల్యూమినియమ్ గళాసులు కుండలో ముంచి నీళ్లిచ్చేడు సిసింద్రీ. గ్లాసులు సొట్టలుపడి ఉన్నాయి. సొట్టలకి మకిలి పట్టింది. ఆ నీళ్లతో ముఖం కడుక్కొని, చేతిలో నీరు పోసుకుంటు తాగి, మరికొన్ని నీళ్లడిగేడు తవిటయ్య. "నీల్లు దొరకడంనేదు! టిఫినన్నా జేసుంటే మ్రరెండు గళాసుల్నిలిద్దును!" అని గొణిగి, వో అరగ్లాసుడు నీరు పోసేడు సిసింద్రీ.

రెండు చిన్న గ్లాసులు అరచేతిలో నొక్కిపట్టుకొని, 'టీ' కెటిల్‌లోంచి ఔన్సున్నర చొప్పున పోసి అందించేడు సిసింద్రి, మాలిక్‌కీ, కూలీకీ.

"వొర్సాలు పడ్డంనేదేటి!? యేడి జబర్దస్తీగా ఉంది!" అన్నాడో టీ పానీయుదు. "యేడి బొక్కబద్దలు కొడుతన్నాది..." వొర్సాలు గూడా జబరుగుంటయి!" అని ఘాటుగా వాతావరణ జ్యోతిష్యం చెప్పేడు, 'టీ'కి రెండోపట్టు పట్టేసరికి అయిపోగా "ఏటింత తక్కువిచ్చినావ్!" అంటూ తోక తగిల్చి మీసాల నాయుదు... చుట్టకోసం జేబు తడుముకుంటూ–

"ఈ యేళ బేరమేనేదు!" అన్నాడు తవిటయ్య టీ చప్పరిస్తూ విచారంగా.

"మగ నా కొడుకులు గాజు లేయించుకుంటే నీ గాజులకి మంచి గిరాకీ!" ఒక విట్టు విశ్టేడు రాజబాబులా కనిపిస్తున్న వో కుర్రాడు. "యిపుడు వేయించుకోలేదా మగాళ్ళు గాజులు? కానయితే యీ గాజులు పైక్కనిపించవ్!" -అన్నాడు పత్రికలోని "సామన్యుడి సణుగుడు" లోని విసుర్ని టీతో సహా ఎంజాయ్ చేసిన వో పిల్లసైజు పొలిటికల్ కమెంటేటర్ పత్రిక ముడిచేస్తూ– "యీ ఫేషన్లొచ్చి సేక గాజులు చెల్లడంనేదు బాబా!" అన్నాడు



కుమారి టాబ్లెట్
(Registered)
తెలివైన స్త్రీలు ఎల్లప్పుడూ ఆరోగ్యముకొరకు దీనిని ప్రతి నెల వాడుచున్నారు. ఆరోగ్యమునకు ఎట్టి హాని కలిగించదు. MILD (20Tabs) Rs 7/-. FORTE (20 Tabs) Rs. 10/- పోస్టేజి మరియు హోల్ సేల్ ధరలు అదనం.
ఇంగ్లీషులో వ్రాయండి :
SOLAR DRUG Co. (A.P.)
9/3 C.T. Lane, Calcutta 700040.

74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
నారసింహలేహ్యం
రిజిష్టర్డు ట్రేడ్ మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కలిగించు వాజీకరము
1 డబ్బా రు. 7—25 పోస్టేజి ప్రత్యేకము.
పి. శి. ఏ. అండ్ కో.,
పెందేప 523273 [ప్రకాశం జిల్లా]
క్యాటలాగు ఉచితము కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.



మాలిక్. "గాజు గాజులు నరసానికి పనికి రావయ్య ?" మరొక మధ్య వయస్కుడు. "ఏం బాబూ ?" "చప్పుడు చేస్తాయి ... విరుగుతాయి...గుచ్చుకుంటాయి... గుప్‌చిప్ వ్యవహారాలెక్కువ కదయ్యా ఇవాళా రేపు? అందుకు గుప్‌చప్ గాజులు కావాలి." "అవీ ఉన్నాయి బాబూ ! తమరి ల్లు ఇక్కడేనేటి బాబూ ?" "మాకు గుప్‌చప్ వ్యవహారాలు లేవోయి !" "గాజు గాజులు కూడా ఉన్నాయండి!" "వొద్దు లేవయ్యా..."

టీ తాగడం అయింది, సరిగ్గా ముప్పయి పైసలు తీసి ఇచ్చేడు మాలిక్.

కావడి తవిటి భుజంమ్మీదికి వెళింది. "గాజులు గాజులేయ్ !" మాలిక్ అరవగా ..."గాజులోయ్ గాజులు!" అంటూ టీ ఇచ్చిన శక్తితో అరిచేడు తవిటయ్య.

"ఏయ్ గాజులూ !" ఎక్కణ్ణించో ఆడ గొంతు. మాలిక్ ఆగేడు- ఆశగా వెతికేడు పిలిచే ముఖం కోసం. ఓ మేడ యింటి గడప మీంచి వో పదేళ్ల పిల్ల పిలుస్తోంది. తవిటయ్య మనసులో ఆశ చిగురించింది వో నాలుగురూపాయల గాజలన్నా మేడింటి అమ్మ కొంటే అందులోంచి రెండు రూపాయలు రాబట్టొచ్చు మాలిక్ కాళ్లమీదపడి. ఈ బేరం దక్కాలని దేవుడికి మొక్కేడు. పిలుస్తారు- "ఫలానా రకం గాజులున్నాయా ?" చీర డిజైన్లలా ఎన్నో డిజైన్ల గాజులులొస్తున్నాయి ... ఎన్నని ఉంచడం! లేనివే అడుగుతారు... ఎప్పుడో ఎవరో బంధువు బొంబేనించో, ఢిల్లీనించో వో ఫేన్సీ గాజు వేసుకొస్తుంది- అటువంటి గాజు కోసం తవిటయ్య పెట్టెలు వెతుకుతారు— లేకపోతే పొమ్మంటారు.

కింది భాగంలోని, ముందు గదిలో కావిడి దించేడు తవిటయ్య పెట్టెలోని చిన్న జంబు ఖానా తీసి మాలిక్ కూచుందుకి పరిచేడు— తవిటయ్యకి విశ్రాంతి ... మాలిక్‌కి పని.

జిగి జిగి మెరిసే జిగినీవాను ప్రౌఢ, మత్సరం వొడుతూ మాలిక్‌కి మాలిక్‌లా ఆదేశించింది. "ఏమేం రకాలున్నాయో చూపించు !" షాపుల కెళితే అక్కడి గాజుల మనిషిని ఏమండీ అంటారు...ఇంటి కొస్తే ఏకవచన ప్రయోగమే.

"రబ్బరు వున్నాయి—లక్క వున్నాయి— గాజాలక్కా కలిసినవీ— పూసలూ లక్కా కలిసినవీ— ఉత్త గాజువీ... రక రకాలున్నాయమ్మా..." "చూపించండి" ... 'చూడండి..."

గాజులు మెరిసి పోతున్నాయి— మురిసి పోతున్నాయి వాటిలో అవి. మురిపించి, లతాలవంగుల, కోమల పల్లవ పాణులను పెనవేసు కుందామని అనుకుంటున్నాయి. సంభాషణ ఇలా నడిచింది— గాజుల బేరం గలగలా ప్రతిధ్వనించింది.

విలా ఈ గాజులు ? రూపాయికి రెండమ్మా ! అంత ఖరీదే ? రూపాయికి ఖరీదెక్కడుందమ్మా ? ఏం ? ఎందుకు లేదు ? కిలో బియ్యం రెండున్నరమ్మా — కందిపప్పు నాలుగు— కిలో దుంపలు రూపాయిన్నర—పాలు మూడు రూపాయలు— ఎన్ని రూపాయల గాజులమ్మితే నాకు కిలో బియ్యం డబ్బు. ఈ కూలివాడి కూలీ కిడతాయి చెప్పండి— రెండు రోజులయి కూలి ఇవ్వలేదు నేను... ఇంక ఈ గాజుల విరుగూ తరుగూ ...రోజుకి రెండో కూలి? ఇంత తక్కువా మైగాడ్! రిక్షా వాడు మైలుదూరం లేని సినిమా హాలుకి రెండ్రూపాయ లడుగుతాడే? చూశారా అమ్మా... మీరే ఒప్పుకుంటున్నారు ... రూపాయికి విలువలేదని! మరి రూపాయికి రెండు గాజులంటే చవకే కదమ్మా ? ఈ ప్రపంచంలో చవకయినవి డబ్బూ, మనుష్యులే... తక్కినవన్నీ ప్రియమేనమ్మా! నన్ను అమ్మా బామ్మా అనకు ... నేను అమ్మనీ అమ్మమ్మనీ కాను— క్షమించండి అమ్మాయిగారూ! ఈ గాజు లెంత? ఒక్కో గాజు రెండ్రూపాయలు అమ్మాయి గారూ ... వాట్ ! రెండ్రూపాయిలే! ... సిరిసిరిమువ్వ గాజులండి... జయప్రద సిన్మాలో యీ గాజులే వేసుకుందండి! అవి తొడుక్క చూడండమ్మగారూ ... జయప్రద పెర్సనాలిటీని మించి పోతారండి! అందులో మూగదిగా? అయితేనేమండి? గాజుల గలగల ముఖ్యమండి !

ఇలా అరగంట నడిచింది బేరం. ఇంతలో ఐస్క్రీం బండివాడు రాగానే పదేళ్ల పిల్లతో సహా మరో ముగ్గురు పిల్లలూ మారాం చేస్తే, పిల్లలమీది ప్రేమువట్టలేక, "కొనుక్కోండమ్మా!" అంటూ పదిరూపాయల కాగితం పర్సులోంచి తీసిచ్చింది జిగినీవాను. అమ్మాయి గారని పిలిపించుకున్న అమ్మగారు. కప్పు ఐస్క్రీమ్... పిస్తా కలిసినవి సంబరపడుతూ కొనుక్కున్నారు పిల్లలు— అమ్మకి ఒకటిచ్చేరు... పెద్ద సైజు కప్పులు... పది రూపాయల కాగితం జేబులో పడేసుకొని బండి తోసుకుంటూ పోయేడు 'క్వాలిటీ' క్రీమ్‌వాడు. బేరాలు లేనేలేవ్... తర్జన భర్జనలు అసలే లేవు... జయప్రదలూ... వాణిశ్రీలూ దింపబడలేదు... నోటు. కాగితం ముక్కలా విసరబడింది... కప్పులు చేతులలో కొచ్చేయి... క్రీము నోట్లలోకి, చల్లచల్లగా... మెల్లమెల్లగా... స్వీట్ స్వీట్‌గా వెళ్లింది... ఓ హౌ! నైస్!


"ఒద్దయ్యా మాకేం నచ్చలేదు గాజులు షాపుకెళ్లి కొనుక్కుంటాం..." జిగినీవాను బిగిబిగి భావం పెదవివిరిచి, క్రీమ్ చప్పరించి కళ్లు మూసుకుంది... వలం అయితే అయ్యేరు గాక... ఈ ఆనందం వదులుకోగలనా! నన్నపడమంటారు శ్రీవారు! సారీ పెర్!

### విప్లవకారుడు

హుస్సేన్‌సాగర్ కట్టవిూన
ఒక్కనాటి ఉదయాన
హుష్నారు పుట్టింది
ఉరికిందు, ఉరికిందు, ఉరికిందు,
ఉరికిందు
బోర్లపడి మోకాల్చిప్ప పలిగింది
తలకు దెబ్బ తలిగింది
భోరుమని ఏడ్సిండు
ఐడింగు రాసిండు
ఉష్నారెందుకు ? ఉరుకుడెందుకని ! ?
ఊల్లెకచ్చిండు
తలకు తాకిన దెబ్బ తలపులను
మార్చింది
తలలు తీసుడెందుకు ? తనువులు
సాలిచ్చేదెందుకని
తనోళ్లలో కలిసిండు
హైరానెందుకని హర్యానాచద్దర్‌కప్ప
కున్నడు
పరేషానెందుకని పప్పాషారు తాగి
పండుకున్నడు!

—రాజేంద్ర

ఐటెక్స్
కాటుక & తిలకము
నాణ్యతలో గొప్పవి
అందమైన రంగులు



33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.
ARAVIND
LABORATORIES
MADRAS-600 033
AL:T2

# బరువు

బరువు తవిటయ్య భుజం ఎక్కింది... "గాజులు... గాజులోయ్!" మాలిక్ అరవగా నీరసంగా... "గాజులోయ్... గాజులు!" తవిటయ్య అరిచేడు. సూర్యుడు పడమటికి దిగిపోతున్నాడు... ఎన్నో వీధులు...ఎన్నెన్నో వీధులు తిరిగేసరికి... ఆరు దాటిపోయింది.

"ఇయాళన్నా నా కూలిప్పించండిదొరా" తవిటయ్య ఒగర్చేడు. సత్తువంతా సన్న గిల్లింది. ఈ బరువు దించి ఇంటి వరకూ ఒంటి బరువుని మొయ్యగలనో లేనో అను కున్నాడు.

"నువ్వే చూస్తున్నావ్? నాకేమన్నా డబ్బులు కిడితేకదా? నాకులేందే నీకేం ఇస్తాను? ఈ గాజులు అరువు తెచ్చేనుకదా? ఆ హోల్‌సేలర్‌కి నాలుగొందలు బాకీరా! దానిమీద వడ్డీకూడా ఇచ్చుకోవాలి!

"మాలిక్! రూపాయి డబ్బులు తమ కేపాటి! ఓ రూపాయిప్పించండి!" ఆశగా చూసేడు.

"చెబ్తుంటే దులుపుదును! రూపా యంటే మాటలా?"

"రూపాయి సవకని అయమ్మతో తమ రనలేదా దొరా?"

"ఆ యమ్మకి రూపాయి సవకరా! నాక్కాదు! అయిన్స్‌క్రీమ్ కిచ్చింది పది! ఓ రూపాయిచ్చి గాజులు కొందిరా? ధరెక్కు వుట...! ప్రియవట...! హాయ్ అల్లా!" అని మూలిగేడు మాలిక్...

చీకటి పడిపోయింది... ఓ రూపాయన్నా కళ్ళపడలేదు...

"ఎంకట్రమణా! బుజాల మించీ బరు వెప్పుడు దిగుద్ది? యీ అలుపెప్పుడు పోతది? కడుపుల కుసింత గంజి నీరెప్పుడు పడతది? నా బారియ చయరోగ మెప్పుడు మానుతది? నా బొట్టె నూకాలెవడ్నో నెగ దీసుక పోకండ ఉంటదా?" తవిటయ్య మనసులో అక్క ప్రశ్నలూ సందేహాలూ — ప్రశ్నలు సందేహాలుగానే ఉండిపోయేయి.

మాలిక్ మియా ఆగేడు, ఒక బ్రహ్మాండ మైన ఐడియా రాగా— "తవిటీ! మరిచే పోయేను! బస్‌స్టేండ్ దగ్గర మైదానంలో కార్నివాల్ ఎగ్జిబిషన్ జొతోంది కదరా? అక్కడకెళ్ళి బయట కూచున్నా మంచే గాజులు చెల్లుతాయొరే!"

# శంకర పాళీలు

కావలసిన సామానులు : మైదాపిండి — పావుకిలో, గోధుమపిండి— పావుకిలో, పంచ దార— ఒకకిలో, నెయ్యి— అరకిలో, పాలు— ఒక గరిటెడు.

తయారుచేయుట : మొదట మైదా పిండినీ, గోధుమ పిండినీ బాగా మెత్తగా జల్లించి, రెండు పిండిలూ కలిపి, అందులో కొద్దిగా నెయ్యీ, పాలూ, కలిపి, బాగా పిసికి, పూరీల పిండిలా గట్టిగా మెత్తగా పిసకాలి. తరువాత, ఈ పిండిని నిమ్మకాయ సైజులో ఉండలుగా చేసుకుని, పల్చగా పెద్దగా అప్పడాలలా వత్తుకోవాలి. ఆ తరు వాత, ఆ అప్పడాలను చిన్నచిన్న ముక్కలుగా గుండ్రంగా కానీ, కాజాలుగా కానీ కోసుకు నుంచుకోవాలి. అలా అన్నీ కోసుకున్నాక, పంచదారని లేత తీగపాకం పట్టుకు నుంచు కోవాలి. ఆ తరువాత కోసుకుని వుంచుకున్న ఆ ముక్కలను నేతిలో వేసి ఎర్రగా దోరగా వేయించుకుని పాకంలో పడేస్తూండాలి. కొద్దిసేపటికి ఈ ముక్కలు పాకాన్ని పీల్చు కుని, ఉబ్బి, గట్టిపడి కరకర లాడేలా తయారవుతాయి. యివి 3 నెలలు పైగా పాడవుకుండా, రుచి చెడకుండా, ఈ శంకర పాణీలు నిలవ ఉంటాయి.

— జి. రామలక్ష్మి.

ఎక్కడ ఎగ్జిబిషను... మరో నాలుగు మైళ్ళ నడక!

మరో అడుగు వెయ్యలేక తవిటయ్య, క్షణక్షణానికి భారమయి పోతున్న కావిడి దించేడు. ఏదురుగా అగపడే, ఎంతకీ తరగని ఎత్తయిన చీకటి దారికేసిచూసేడు.

అలసటతో... నీరసంతో... ఆకలితో... ఎప్పటికీ అంతమవని బెంగతో ... భావి అంటే భయంతో...వర్తమానం అంటే వెరపుతో... ఎప్పటికీ దిగని బరువుతో ... ఆ రోడ్డు మీద కుప్పగా కూలబడి, "నా నింకీ బరువు మొయ్యలేను దేవుడా!" అంటూ ముఖం రెండు చేతులా కప్పుకొని భళ్ళున ఏడ్చినాడు.